సాక్షి
పెద్దపల్లి
గురువారం : 28 : మార్చి : 2024



రామునికి గోటితో ఒలిచిన తలంబ్రాలు

గోదావరిఖని: భద్రాచల రాముని కల్యాణం కోసం బంగ్లాస్ ఏరియా దుర్గామాత ఆలయంలో లేడీస్ క్లబ్ సభ్యులు గోటితో ఒలిచే తలంబ్రాల కార్యక్రమం చేపట్టారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురు(సా॥)	సహర్ శుక్ర(ఉ॥)
కరీంనగర్	6.27	4.45
పెద్దపల్లి	6.34	4.51
రాజన్న సిరిసిల్ల	6.34	4.51
జగిత్యాల	6.34	4.51

గరిష్ఠం/కనిష్ఠం
37.4/24.5

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగలు ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. ఉదయం, రాత్రి వేళ చల్లగా ఉండే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో ఇఫ్తార్



ఇఫ్తార్‌లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ దంపతులు

పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్‌లోని క్యాంపు కార్యాలయంలో అడిషన్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ బుధవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ దంపతులతోపాటు కలెక్టరేట్ అధికారులు హాజరయ్యారు. రంజాన్ మాసంలో ఆచరించే ప్రార్థనలు, ఉపవాస దీక్షలు, క్రమశిక్షణ ఆధ్యాత్మికతను పెంపొందిస్తాయని కలెక్టర్ అన్నారు. ఆర్డీవోలు హనుమా నాయక్, రంగయ్య, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్యం



మాట్లాడుతున్న అరుణశ్రీ

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ప్రసూతి సేవలు మెరుగయ్యాయని, ఇందుకోసం అన్ని వసతులు అందుబాటులోకి వచ్చాయని, ఈ నేపథ్యంలో గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ సూచించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. సున్నితమైన కేసులను గుర్తించి మెరుగైన సేవలందించాలన్నారు. గతేడాది ఆరు మాతృమరణాలు సంభవించాయని, భవిష్యత్‌లో ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాతాశిశు ఆస్పత్రిలో అవసరం మేరకు వైద్యులను నియమించి, వసతులు కల్పించామని తెలిపారు. జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్, నరేందర్, శ్రీధర్, కృపాబాయి, వాణి శ్రీ, అరుణ, రమాదేవి, స్రవంతి ఉన్నారు.

సజావుగా ఎన్నికల నిర్వహణ



మాట్లాడుతున్న ఆర్డీవో హనుమా నాయక్

రామగిరి(మంథని): పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని మంథని ఆర్డీవో హనుమా నాయక్ కోరారు. స్థానిక జేఎన్టీయూలో బుధవారం పోలీసు అధికారులు, నియోజకవర్గ స్థాయి ఎన్నికల బృందాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. మంథని నియోజకవర్గంలో ఎన్నికల వ్యయం పర్యవేక్షించడానికి 3 ఫ్లయింగ్ స్క్వాడ్స్, చెక్‌పోస్ట్‌ల వద్ద 3 స్టాటిక్ సర్వేలెన్స్, ప్రతీ మండలానికి ఓ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణకు 37 మంది సెక్టారు అధికారులను నియమించామన్నారు. గోదావరిఖని ఏసీపీ రమేశ్‌గౌడ్, రామగుండం టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, కాటారం డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి, మంథని, కాటారం సీఐలు వెంకటేశ్వర్లు, నాగార్జున, ఎస్సై సందీప్‌కుమార్ పాల్గొన్నారు.


‘చెరువుపై మాకే హక్కులు’



మహిళలను సముదాయిస్తున్న ఎస్సై

పెద్దపల్లిరూరల్: ‘మా ఊళ్లో చెరువు, కుంటలపై పొరుగున ఉన్న అక్కెపల్లి(మంథని మండలం) గ్రామస్తులు దౌర్జన్యంగా హక్కులు అనుభవిస్తున్నారని, మా చెరువు, కుంటలు మాకే దక్కేలా చూడాలి’ అని బుధవారం కలెక్టరేట్ సమీపంలో రాజీవ్ రహదారిపై మంథని మండలం పుట్టపాక, కన్నాల గ్రామాలకు చెందిన మత్స్యకార మహిళలు నిరసనకు దిగారు. తమకు దక్కాల్సిన చేపలను వేరే గ్రామస్తులు దౌర్జన్యంగా తీసుకెళుతున్నారని ఆరోపించారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని లత, కనకమ్మ, రాజేశ్వరి ఆవేదన చెందారు. సమాచారం అందుకున్న ఎస్సై సుధాకర్‌రావు సంఘటనా చేరుకున్నారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు. అనంతరం సమస్యను జిల్లా మత్స్యశాఖ అధికారి భాస్కర్ నాయక్ దృష్టికి తీసుకెళ్లి ఇరువర్గాలతో చర్చించారు. సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

మాదిగలకే టికెట్ ఇవ్వాలి



ఢిల్లీ తరలివెళ్తున్న మాదిగశక్తి నేతలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఎంపీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసే అవకాశాన్ని మాదిగలకే ఇవ్వాలని మాదిగ శక్తి వ్యవస్థాపకుడు బొంకూరి సురేందర్ సన్నీ డిమాండ్ చేశారు. ఇదే విషయంపై బుధవారం ఢిల్లీ బయల్దేరి వెళ్తున్నట్లు వివరించారు. ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దల ముందు తమ గొంతుక వినిపిస్తామన్నారు.

ఆమెడ దూరం



- ఓట్లలో ఘనం.. దక్కని సీట్లు
- కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లోనూ పురుషులకే అవకాశం

సాక్షి, పెద్దపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ‘ఆమె’ తీర్పు అతికీలకం కానుంది. పార్లమెంట్ పరిధిలోని ఆరు నియోజకవర్గాలను పరిశీలిస్తే.. అన్నిచోట్ల పురుషుల కంటే మహిళల ఓట్లే అధికంగా ఉన్నాయి. అభ్యర్థుల గెలుపోటముల్లో వీరి తీర్పే ప్రధాన భూమిక పోషించనుంది. అయితే, మహిళలకు సీట్లు కేటాయించే విషయంలో ప్రధాన రాజకీయ పార్టీలు ముందుకు రావడం లేదు. పురుష అభ్యర్థులకే అవాశాలు కల్పిస్తున్నాయి. 33శాతం మహిళలకు రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బీజేపీ.. ఆ చట్టాన్ని వెంటనే అమల్లోకి తేవాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తుండగా.. మద్దతు ఇచ్చిన బీఆర్ఎస్ పెద్దపల్లి లోక్‌సభ బరిలో నిలిచి పార్లమెంట్‌లో అడుగుపెట్టేందుకు మహిళలకు అవకాశం కల్పించలేదనే అపవాదు మూటగట్టుకుంది.

అందరూ పురుషులే..



- పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఇప్పటిదాకా అందరూ పురుషులే ఎమ్మెల్యేలుగా గెలుపొందారు.
- అసెంబ్లీ, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల ఆధారంగా పురుషులతో సమానంగా మహిళలు పోటీపడుతున్నారు.
- లోక్‌సభకు వచ్చేసరికి మహిళల ప్రాతినిధ్యం ఆశించిన స్థాయిలో కనిపించడంలేదు.
- 2019 ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి మొత్తం 17మంది పోటీలో నిలువగా అందులో ఇద్దరే మహిళలు ఉండడం గమనార్హం.
- 2014ఎన్నికల్లో సైతం 17మంది పోటీచేస్తే కేవలం ఒక్క మహిళా అభ్యర్థి బరిలో నిలిచారు.
- ప్రధాన పార్టీలు టికెట్లు ఇవ్వడానికి ఆసక్తి చూపకపోగా, ఇటు స్వతంత్రంగా పోటీచేసేందుకు కూడా ఎవరూ ముందుకు రావడం లేదు.
- విస్తీర్ణ పరంగా పార్లమెంటు పెద్దగా ఉండడం ఒక కారణంగా చెప్పవచ్చు.
- అయితే పార్టీలు టికెట్లు ఇస్తే పోటీ చేసేందుకు చాలామంది మహిళలు ఆసక్తిగా ఉన్నారు.

ఒక్కరే మహిళా ఎంపీ



పార్లమెంట్ పరిధిలోని రామగుండం మినహా ఆరు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఎస్సీ రిజర్వుడ్ స్థానమైన పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఇప్పటి వరకు కేవలం ఒక్క మహిళే ఎంపీగా గెలుపొంది పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. ప్రస్తుతం కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశించి భంగపడిన డాక్టర్ సుగుణకుమారి.. 1998– 1999 ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపీగా పోటీచేసి పార్లమెంట్‌కు వెళ్లారు. పెద్దపల్లి నియోజకవర్గం 1952, 57లో కరీంనగర్ ద్విసభ్య లోక్‌సభగా ఉండేది. ఆ రెండుసార్లు పీడీఎఫ్ అభ్యర్థి ఎంఆర్ కృష్ణ విజయం సాధించారు. అనంతరం ఆయన కాంగ్రెస్‌లో చేరి 1962, 67లో తిరిగి గెలుపొందారు. 1971లో తెలంగాణ ప్రజాసమితి అభ్యర్థిగా తుల సీరామ్ పోటీచేసి గెలిచారు. 1977లో కాంగ్రెస్‌లో చేరి గెలుపొందగా, 1980లో కోదాటి రాజమల్లు కాంగ్రెస్ తరఫున విజయం సాధించారు. 1984లో టీడీపీ నుంచి పోటీచేసిన గొట్టె భూపతి గెలువగా, 1989, 91, 96లో కాంగ్రెస్ తరఫున జి.వెంకటస్వామి హ్యాట్రిక్ విజయం సాధించారు. 1998– 99లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి డాక్టర్ సుగుణకుమారి గెలువగా, 2004లో మళ్లీ జి.వెంకటస్వామి విజయం సాధించారు. 2009లో జి.వివేక్ కాంగ్రెస్ తరఫున గెలిచారు. 2014లో బాల్క సుమన్, 2019లో వెంకటేశ్ నేత బీఆర్ఎస్ నుంచి విజయం సాధించారు. ప్రస్తుతం ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ నుంచి ‘కాకా’ మనుమడు గడ్డం వంశీకృష్ణ, బీజేపీ నుంచి గోమాస శ్రీనివాస్, బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఆయా పార్టీలు ప్రకటించాయి. చిన్నపార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా ఎవరైనా మహిళలు ఎన్నికల బరిలో నిలుస్తారో లేదో వేచిచూడాలి.

పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఓటర్ల వివరాలు

అసెంబ్లీ	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
చెన్నూరు	95,966	97,264	7	1,93,237
బెల్లంపల్లి	86,800	88,530	13	1,75,343
మంచిర్యాల	1,38,451	1,40,553	25	2,79,029
ధర్మపురి	1,11,951	1,17,646	6	2,29,603
రామగుండం	1,10,238	1,09,966	26	2,20,230
మంథని	1,17,262	1,21,819	17	2,39,098
పెద్దపల్లి	1,26,386	1,29,961	7	2,56,354
మొత్తం	7,87,054	8,05,739	101	15,92,894

క్రీడా పోటీలతో స్నేహభావం పెంపొందుతుంది



ట్రోఫీ అందిస్తున్న ఈడీ కేదార్ రంజన్ పాండు

జ్యోతినగర్(రామగుండం): క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని ఎన్టీపీసీ ఈడీ) కేదార్ రంజన్ పాండు అన్నారు. బుధవారం మహాత్మాగాంధీ క్రీడామైదానంలో నిర్వహించిన గ్రామీణ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్టీపీసీ యాజమాన్యం విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఏటా గ్రామీణ క్రీడా పోటీలు నిర్వహిస్తోందని తెలిపారు. పోటీల్లో ఎన్టీపీసీలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. వారికి ఈడీ ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, వివిధ యూనియన్ల ప్రతినిధులు, ఫిజికల్ డైరెక్టర్ కొమురోజు శ్రీనివాస్, పీఈటీలు, 20 ప్రభుత్వ హైస్కూళ్ల క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రూరల్ స్పోర్ట్స్ మీట్ విజేతలు..

కబడ్డీ బాలురు : ప్రథమ జెడ్పీహెచ్‌ఎస్(బసంత్‌నగర్), ద్వితీయ జెడ్పీహెచ్‌ఎస్(కుక్కలగూడూరు)

- **బాలికలు** : ప్రథమ జెడ్పీహెచ్‌ఎస్(ఎన్టీపీసీ), ద్వితీయ జెడ్పీహెచ్‌ఎస్(పొట్యాల)
- **ఖోఖో బాలురు** : ప్రథమ జెడ్పీహెచ్‌ఎస్(ఎన్టీపీసీ-జ్యోతినగర్), ద్వితీయ జీహెచ్‌ఎస్(గోదావరిఖని)
- **బాలికలు** : జెడ్పీహెచ్‌ఎస్(ఎన్టీపీసీ-జ్యోతినగర్), ద్వితీయ జీహెచ్‌ఎస్ (గోదావరిఖని)
- **వాలీబాల్** : జెడ్పీహెచ్‌ఎస్(జీ)జీడీకే, జెడ్పీహెచ్‌ఎస్(ఎన్టీపీసీ-జ్యోతినగర్)
- **బాలికలు** : జెడ్పీహెచ్‌ఎస్(జీ)జీడీకే, జెడ్పీహెచ్‌ఎస్ (పొట్యాల),
- **అథ్లెటిక్స్(100 మీటర్లు) బాలురు:** నాగరాజు(ఎన్టీపీసీ-జ్యోతినగర్), శ్రీచరణ్, అజయ్(జెడ్పీహెచ్‌ఎస్-కుక్కలగూడూరు), వాణి, అక్షర(ఎన్టీపీసీ-జ్యోతినగర్), హరిత(జీడీకే), 400 మీటర్లలో చరణ్, నాగరాజు, విష్ణువర్ధన్, హరిత, ప్రియాంక, స్వాతిక, షాట్‌పుట్‌లో రఘురాజ్‌కుమార్, సునీల్, ప్రిన్స్ కుమార్, అమూల్య, ప్రసన్న, వర్షిణి, రిలే పోటీలో బసంత్‌నగర్, ఎన్టీపీసీ జ్యోతినగర్, కుక్కలగూడూరు.
- **బాలికలు** : ఎన్టీపీసీ జ్యోతినగర్, పొట్యాల, గోదావరిఖని జట్లు విజయం సాధించాయి.
- రెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో ఎన్టీపీసీ టెంపరరీ టౌన్‌షిప్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ క్రీడాకారులు 67 పాయింట్లు సాధించి ఓవరాల్ చాపింయన్‌షిప్ సాధించారు.

పిల్లలకు మంచి తండ్రిలా ఉండండి

- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

గోదావరిఖని: సమాజంలో రౌడీల్లా కాకుండా పిల్లలకు మంచి తండ్రులుగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో జిల్లాలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్లలో మార్పు కోసం ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. నేరజీవితం వీడి హుందాగా జీవించాలన్నారు. రౌడీషీటర్ అనే పదం తమ బిడ్డల భవిష్యత్ కూడా నాశనం చేస్తుందన్నారు. నేర ప్రవృతిలో మార్పు రాకపోతే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూకబ్జాలు, ప్రజలను భయపెట్టడం, ఆస్తుల ధ్వంసం వంటి చట్టవిరుద్ధ పనులకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని అన్నారు. పదేళ్లుగా నేరాలకు పాల్పడని, సత్ప్రవర్తన కలిగి ఉన్నవారి రౌడీషీట్‌తొ లగించే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ చేతన, గోదావరిఖని, పెద్దపల్లి ఏసీపీలు రమేశ,, గజ్జి కృష్ణ, గోదావరిఖని, పెద్దపల్లి సబ్ డివిజన్ సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్



రిజర్వాయర్ గేట్లు పరిశీలిస్తున్న లక్ష్మణ్‌కుమార్

ధర్మారం(ధర్మపురి): సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. నందిమేడారం రిజర్వాయర్ నుంచి దిగువకు విడుదల చేస్తున్న సాగునీటిని విప్ బుధవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలోనే ఎల్లంపల్లి మోటార్లు కాలిపోయాయని, ఆ విషయాన్ని అప్పటి ప్రభుత్వం దాటిపెట్టిందని విమర్శించారు. గోదావరి నది తలాపున ధర్మపురి నియోజకవర్గం ఉన్నా.. ఈప్రాంత వ్యవసాయ రంగానికి చుక్క నీటి సౌకర్యం కల్పించలేదని ఆరోపించారు. ఇక్కడ నుంచే గజ్వేల్, సిద్దిపేట తదితర ప్రాంతాలకు నీరు తరలించుకపోయినా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రశ్నించకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రస్తుతం ఎండుతున్న పంటలను కాపాడేందుకు ఎల్లంపల్లి నుంచి 0.25 టీఎంసీలను సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు ప్రారంభించారని ఆయన వివరించారు. గ్రామస్థాయి కార్యకర్తల కోరికల మేరకే ఇతర పార్టీల నుంచి చేరికలు ఉంటున్నాయని విప్ ఈ సందర్భంగా వెల్లడించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు లావుడ్య రూప్లానాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్త నర్సింహం, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్‌లు కాడే సూర్యనారాయణ, పాలకుర్తి రాజేశంగౌడ్, నాయకులు అరిగే లింగయ్య, జంగ మహేందర్‌యాదవ్, మంద పెల్లి మల్లేశం, చిప్ప మణిశర్మ, దేవి జనార్దన్, చింతల జగన్మోహన్‌రెడ్డి, పోనవేని స్వామి, ఓరం చిరంజీవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో ఈ సేవ కేంద్రం



ఈ సేవ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి హేమంత్‌కుమార్

పెద్దపల్లిరూరల్: న్యాయస్థానాల్లో ఏర్పాటు చేసిన ఈ–సేవ కేంద్రాలను సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ వర్చువల్ పద్ధతిన ప్రారంభించారు. బుధవారం జిల్లా ప్రధాన న్యాయస్థానంలో ఏర్పాటు చేసిన ఈ సేవ కేంద్రాన్ని జిల్లా జడ్జి హేమంత్‌కుమార్ ప్రారంభించారు. సీనియర్ సివిల్ జడ్జి అర్జున్, జూనియర్ సివిల్ జడ్జి రాణి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీపీసీ హెచ్‌ఆర్ డైరెక్టర్‌గా అనిల్‌కుమార్

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ డైరెక్టర్(హెచ్‌ఆర్)గా అనిల్ కుమార్ జాడ్లిని నియమిస్తూ భారత ప్రభుత్వ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ సెలక్షన్ బోర్డు అధికారులు బుధవారం నియామకపు ఉత్తర్వులను విడుదల చేశారు. న్యూఢిల్లీలో జరిగన సమావేశంలో ఎన్టీపీసీ డైరెక్టర్(హెచ్‌ఆర్)గా జాడ్లిని నియమించారు. అనిల్‌కుమార్ జాడ్లి ఎన్టీపీసీ రామగుండంలో ఇప్పటికే పలు హోదాల్లో విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం చీఫ్ జనరల్ మేనేజర్(హెచ్‌ఆర్)గా విధులు నిర్వహిస్తున్న క్రమంలో డైరెక్టర్(హెచ్‌ఆర్)గా పదోన్నతి కల్పించారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టుకు చెందిన పలువురు అధికారులు, వివిధ యూనియన్లకు చెందిన ప్రతినిధులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

సర్కారు నిర్లక్ష్యంతోనే ఎండుతున్న పంటలు

- 30న రైతులతో కలిసి 36 గంటల నిరసన దీక్ష
- మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ వెల్లడి



మాట్లాడుతున్న మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్, జెడ్పీ చైర్మన్ మధు, కోరుకంటి చందర్

సాక్షి, పెద్దపల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేతగాని తనంతో సాగునీరు అందక పంటలు ఎండుతున్నాయని మాజీమంత్రి, బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. జెడ్పీ చైర్‌పర్సన్ పుట్ట మధుకర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్‌తో కలిసి బుధవారం చీకురాయి, భోజన్నపేట శివారులో ఎండిన వరి పంటను ఆయన పరిశీలించారు. అనంతరం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సాగునీరు అందక యాసంగి పంటలు ఎండిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో 50 టీఎంసీల నీళ్లు సముద్రంలో కలిశాయన్నారు. కౌలు చేసిన రైతులు కనీసం కౌలు కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. రైతులను మోసగించిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పిలుపుమేరకు ఎండిన పంటలు పరిశీలించి, రైతులకు భరోసా కల్పించి, పంట నష్టం అంచనాలు సేకరిస్తున్నామని ఆయన తెలిపారు. జిల్లా కేంద్రంలో ఈనెల 30న ఉదయం 8 గంటల నుంచి ఈనెల 31వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు రైతు నిరసన దీక్ష చేపడతామని ఆయన వెల్లడించారు. రామగుండం, మంథని, పెద్దపల్లి నియోజకవర్గాల్లోని రైతులు భారీ సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మార్కు లక్ష్మణ్, కౌన్సిలర్లు పూదరి చంద్రశేఖర్, శ్రీధర్, మాజీ సర్పంచ్ తీగల సదయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, నాయకులు గుజ్జుల రాజిరెడ్డి, సలేంద్ర రాములు, ధర్మపురి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పేరిట విధ్వంసం తగదు

- సింగరేణి క్వార్టర్లు కూల్చివేస్తే చూస్తూ ఊరుకోం
- కార్మిక సంఘాల నాయకుల హెచ్చరిక



సంఘీభావం తెలుపుతున్న కార్మిక నేతలు

గోదావరిఖని: రామగుండం అభివృద్ధి పేరిట సామాజిక విధ్వంసం సృష్టిస్తున్నారని, సింగరేణి క్వార్టర్ల కూల్చివేతను తాము ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని సింగరేణి కార్మిక సంఘాల నాయకులు స్పష్టం చేశారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గోదావరిఖనిలో పదిరోజులుగా పాలకులు, అధికార యంత్రాంగం, సింగరేణి యాజమాన్యం రోడ్ల విస్తరణ పేరిట సామాజిక విధ్వంసానికి పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని విమర్శించారు. 72క్వార్టర్ల తొలగింపు నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. రామగుండం ఎమ్మెల్యే ఒంటెద్దు పోకడలతో కాంగ్రెస్ నాయకులను ఉసిగొల్పుతూ కూల్చివేతలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దీనిపై ఎన్నికల కమిషన్, రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు తుమ్మల రాజారెడ్డి, జక్కుల నారాయణ, ఆకుల హరీశ్, కృష్ణ, నరేశ్, తోట వేణు, నంబయ్య, రామస్వామి, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

వణికిస్తున్న వైరల్ ఫీవర్

- ఫేషెంట్లతో రద్దీగా మారుతున్న ఆస్పత్రులు



కాల్వశ్రీరాంపూర్‌లో చికిత్స పొందుతున్న పేషెంట్లు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): వివిధ గ్రామాల్లో వైరల్ ఫీవర్ ప్రజలను వణికిస్తోంది. వారం రోజులుగా జ్వరాల తీవ్రతతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. పరిస్థితి తీవ్రంగా ఉన్న వారు మెరుగైన చికిత్స కోసం పట్టణ ప్రాంతాలకు పరుగులు తీస్తున్నారు. వాతావరణంలో మార్పులతోపాటు, దోమలు విజృంభిస్తుండటంతో ప్రజలు జ్వరాల బారినపడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. అయితే, చికున్‌గున్యా లక్షణాలు, విషజ్వరాల లక్షణాలు కనిపిస్తున్నాయని, సకాలంలో వైద్యం తీసుకోవాలని సూచించారు. ఒంటి నొప్పులు, కాళ్లవాపులు, మోకాళ్ల నొప్పులు, కీళ్లనొప్పులు తమకు బాధిస్తున్నాయని మరోవైపు వ్యాధిగ్రస్తులు వాపోతున్నారు. జ్వరాల విషయంపై మెడికల్ ఆఫీసర్ మహేందర్‌ను వివరణ కోరగా, ఎండల తీవ్రతతోపాటు, వాతావరణంలో మార్పులతో జ్వరాలు ప్రబలుతున్నాయన్నారు. ప్రజలు ఆందోళన చెందవద్దని సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో బాధితులకు చికిత్స అందిస్తున్నామని తెలిపారు. అన్నిరకాలు మందులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. అత్యవసర కేసులను అడ్మిట్ చేసుకుని చికిత్స అందిస్తున్నామని పేర్కొన్నారు.

లక్ష్య సాధనలో అగ్రస్థానం

- వారం ముందే ఆర్జీ–1 టార్గెట్ ఛేదన
- కీలకపాత్ర పోషించిన జీడీకే–5 ఓసీపీ
- సమష్టిగా లక్ష్యాలు సాధించాం : జీఎం చింతల శ్రీనివాస్



గోదావరిఖని: పేరులోనే కాదు.. ఉత్పత్తిలో కూడా నంబర్ వన్‌గా ఆర్జీ –1 ఏరియా నిలిచింది. వారం ముందుగానే నిర్దేశిత వార్షిక ఉత్పత్తి లక్ష్యాలు సాధించింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 43.80 లక్షల టన్నుల లక్ష్యంగా యాజమాన్యం నిర్దేశించింది. దీనిని వారం ముందుగానే అధిగమించింది. ఏరియాలో బొగ్గు ఉత్పత్తిలో కీలకంగా నిలిచిన జీడీకే–5 ఓసీపీ దూకుడుగా ముందుకు సాగింది. దీంతో ఈనెల 25వ తేదీ నాటికి నిర్దేశిత 43.80లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి నమోదు చేసింది. ఇందులో జీడీకే–5 ఓసీపీ ప్రధాన భూమిక పోషించింది. ఏరియాలోని జీడీకే–11గని, జీడీకే–2, 2ఏ, జీడీకే –1 గనులు కూడా ఉత్పత్తి లక్ష్యాల సాధనలో దూకుడుగా సాగాయి. అయితే జీడీకే–5 ఓసీపీ అత్యధిక ఉత్పత్తి సాధించింది.

జీడీకే–5 ఓసీపీ రికార్డుస్థాయి బొగ్గు ఉత్పత్తి

- 2023–24 ఆర్థిక సంవత్సరంలో జీడీకే–5 ఓసీపీ సోమవారం రికార్డు స్థాయి బొగ్గు ఉత్పత్తి సాధించింది.
- ఒక్కరోజులోనే 16,119 టన్నుల బొగ్గు వెలికి తీసింది.
- వాస్తవానికి జీడీకే–5 ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను 20రోజుల ముందుగా సాధించింది.
- అయితే ఒకేరోజు 9వేల టన్నుల టార్గెట్‌కాగా ఈనెల 25న అత్యధికంగా 16,119 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి ప్రాజెక్టులో అత్యధిక రికార్డు నెలకొల్పింది.
- దీనికి సహకరించిన కార్మికులు, అధికారులకు జీఎం శ్రీనివాస్, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్ అభినందనలు తెలిపారు.

సమష్టి కృషితోనే లక్ష్య సాధన



సమష్టి కృషితోనే వార్షిక లక్ష్యాలను ముందుగానే సాధించాం. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి వచ్చే ఆర్థిక సంవత్సరం లక్ష్యాల సాధనలో అగ్రగామిగా నిలవాలి. ఉత్పత్తి లక్ష్యాల సాధనలో ముందంజలో నిలిచేందుకు కృషి చేసిన ఉద్యోగులు, అధికారులు, కార్మిక సంఘాల నాయకులకు కృతజ్ఞతలు.

– శ్రీనివాస్, ఆర్జీ–1 జీఎం

గడిచిన ఐదేళ్లలో ఆర్జీ - 1 సాధించిన బొగ్గు ఉత్పత్తి(లక్షల టన్నుల్లో..)

ఏడాది	లక్ష్యం	సాధించింది	శాతం
2018–19	64.05	60.67	95
2019–20	41.60	25.70	62
2020–21	37.00	18.07	49
2021–22	31.19	20.72	65
2022–23	39.20	47.25	121
2023–24(ఈనెల 25 నాటికి)	42.99	43.97	102

క్లుప్తంగా

తేనెటీగల దాడిలో పశువుల కాపరి మృతి

మల్లాపూర్: తేనెటీగల దాడిలో పశువుల కాపరి మృతిచెందిన ఘటన జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేటలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పుట్ట ధర్మయ్య (35)కు భార్య పోశాని, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ పోషణకు గ్రామంలో పశువులకాపరిగా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే బుధవారం పశువులతో గ్రామశివారులోకి వెళ్లిన ధర్మయ్యపై తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేశాయి. ఈ ఘటనలో ధర్మయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తుల సమాచారంతో పోలీసులు ఘటన స్థలికి వెళ్లి విచారణ చేపట్టారు. ధర్మయ్య భార్య పోశాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): వెన్నంపల్లి గ్రామానికి చెందిన వెల్తూరి మణెమ్మ(49) చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. మణెమ్మ కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. నొప్పి తీవ్రం కావడంతో భరించలేక సోమవారం రాత్రి పురుగులమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పెద్దపల్లిలోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంగనర్ తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ చనిపోయింది. మృతురాలికి భర్త సుదర్శన్, కుమారుడు ఉపేందర్ ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై ఓంకార్ యాదవ్ తెలిపారు.

బుడగజంగం కాలనీలో..

హుజూరాబాద్‌రూరల్: బుడగజంగం కాలనీకి చెందిన ఓ చిన్నారి ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు... కాలనీకి చెందిన మోటం కనకయ్య కూతురు రిషిత(ఏడాదిన్నర వయస్సు) ఈ నెల 25న సాయంత్రం ఆడుకుంటూ పక్క ఇంటికి వెళ్లింది. ఆ ఇంట్లోని పొయ్యి మీద పెట్టిన డికాషన్ ప్రమాదవశాత్తు చిన్నారి మీద పడగా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది

తలపులతండాలో మహిళ..

సారంగాపూర్: మండలంలోని మ్యాడారంతండా పంచాయతీ పరిధి తలుపులతండాకు చెందిన మోతె నర్సవ్వ (49)చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం నర్సవ్వకు చాలా రోజులుగా మానసిక స్థితి సరిగాలేదు. ఈనెల 17న ఇంట్లోనే పురుగుల మందు తాగింది. గమనించిన ఆమె భర్త పోశం ఆమెను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రయత్నించినా ఫలితంలేదు. నర్సవ్వకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యార్థి శవం లభ్యం



అభిలాష్ (ఫైల్)

తిమ్మాపూర్: జిల్లాలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో డిప్లొమా మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి అదృశ్యం కాగా.. బుధవారం బావిలో శవమై కనిపించాడు. ఎల్ఎండీ ఎస్సై చేరాలు కథనం ప్రకారం.. భూపాలపల్లి జిల్లా కాటారం గ్రామానికి చెందిన అభిలాశ్ (20) ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లొమా మొదటి సంవత్సరం చదువుతూ సమీపంలోని హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈనెల 2 నుంచి కనిపించడం లేదని తండ్రి శ్రీనివాస్ ఎల్ఎండీ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదుచేసి విచారణ ప్రారంభించారు. బుధవారం మహాత్మనగర్ శివారులోని గవ్వ రవీందర్ రెడ్డి వ్యవసాయ బావిలో శవమై తేలాడు. కరీంనగర్ ఆస్పత్రి వైద్యులు అక్కడే శవపరీక్ష చేశారు. కొడుకు మృతిపై అనుమానాలు ఉన్నాయనే తండ్రి ఫిర్యాదుతో ఆ కోణంలో విచారణ చేస్తున్నట్లు ఎస్సై చేరాలు వివరించారు.

సింగరేణి కార్మికులు ఎటువైపు?

- మళ్లీ తెరపైకి ఆదాయపు పన్ను మినహాయింపు
- రిటైర్డ్ కార్మికులకు పెరగని పింఛన్
- పార్లమెంట్ ఎన్నికల్లో కీలకంగా సింగరేణి కార్మికుల ఓట్లు



గోదావరిఖని: పార్లమెంట్ ఎన్నికల్లో సింగరేణి కార్మికుల మద్దతు ఎవరికి ఉంటుందనే చర్చ కోల్ బెల్ట్ ప్రాంతంలో జోరుగా సాగుతోంది. సింగరేణి విస్తరించిన ఉన్న ఉమ్మడి నాలుగు జిల్లాల్లో పార్లమెంట్ అభ్యర్థుల గెలుపోటములు వీరి తీర్పుపైనే ఆధారపడి ఉంది.

40వేల మందికిగాపైగా కార్మికులు..

- సింగరేణి సంస్థలో సుమారు 40వేల మందికి పైచిలుకు కార్మికులు, మరో 35వేల మంది కాంట్రాక్టు కార్మికులు, వారి కుటుంబాలు ఉన్నారు. అయితే, సింగరేణి కార్మికులు చాలా ఏళ్లుగా ఆదాయ పన్ను మినహాయించాలని డిమాండ్ చేస్తున్నారు. కొత్త బొగ్గు గనులు తవ్వితే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుడపతాయని అంటున్నారు. సంస్థలో ఏటా గనుల సంఖ్య తగ్గిపోవడం, కార్మికుల కుదింపు, బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ తదితర అంశాలు కూడా ప్రస్తుతం చర్చకు వస్తున్నాయి.

12అసెంబ్లీ, ఐదు పార్లమెంట్ స్థానాలు

- పెద్దపల్లి, ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాల పరిధిలో సింగరేణి బొగ్గు గనుల సంస్థ విస్తరించి ఉంది. అలాగే రామగుండం, పెద్దపల్లి, మంథని, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్, ప్రొఫెసర్ జయశంకర్ భూపాల్‌పల్లి, భద్రాద్రికొత్తగూడెం, పినపాక, కొత్తగూడెం, సత్తుపల్లి, ఇల్లెందు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. సంస్థలో ప్రస్తుతం 40వేల మంది కార్మికులు, 35వేల మంది కాంట్రాక్టు కార్మికులు, 60వేల మందికి పైగా రిటైర్డ్ కార్మికులు ఉన్నారు. అధిక పనిగంటలు, యాంత్రీకరణతో సింగరేణిలో ఉద్యోగావకాశాలు తగ్గుతూ వస్తున్నాయి. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు లభించక ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి సమస్యలు పరిష్కరించే నాయకుడు ఎవరనే దానిపై ఇప్పుడు కోల్‌బెల్ట్‌లో చర్చ సాగుతోంది.

కార్మికుల ప్రధాన డిమాండ్లు ఇవే

- సింగరేణి కార్మికులు ఆదాయ పన్ను మినహాయింపు కోసం 30ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. వారి ఆశలు తీర్చాలి
- నూతన బొగ్గు గనుల ఏర్పాటు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం యువత ఎదురు చూస్తోంది.
- బొగ్గు బ్లాకులను నేరుగా సింగరేణి సంస్థకే కేటాయించి ఈప్రాంత ఉద్యోగ, ఉపాధికి మార్గం సుగమనం చేయాలి
- మెడికల్ ఇన్వాలిడేషన్ పక్రియ సరళీకృతం చేసి భారీగా చేతులు మారే పక్రియకు అడ్డుకట్ట వేయాలి
- ఓసీపీలతో పాటు భూగర్భగనులు కూడా పెంచి కొత్త ఉద్యోగ అవకాశాలు కల్పించాలి
- సింగరేణి సంస్థ బొగ్గు వెలికితీత, థర్మల్, సోలార్ విద్యుత్‌ఉత్పత్తితో పాటు పలు అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలి
- కార్మికుల సొంతింటి కల నెరవేర్చాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది
- సింగరేణి వ్యాప్తంగా కార్మికుల పిల్లలకు సీబీఎస్ఈ సిలబస్, కార్మిక కుటుంబాలకు కార్పొరేట్ వైద్యం కోసం హెల్త్ కార్డులు అందించాలి
- కోలిండియా మాదిరిగా పెర్క్స్‌పై ఇన్‌కం టాక్స్ రీయింబర్స్‌మెంట్ చేయాలి
- రిటైర్డ్ కార్మికుల పింఛన్ పెంచాలి
- కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు, అలవెన్సులు అమలు చేయాలి, సౌకర్యాలు కల్పించాలి.

నిర్దేశిత విద్యుత్ ఉత్పత్తి సాధించిన ఎన్టీపీసీ



రామగుండంలోని ఎన్టీపీసీ ప్రాజెక్టు

విద్యుత్ ఉత్పత్తి(మెగావాట్లలో)

యూనిట్	ఉత్పత్తి సామర్థ్యం	చేసిన ఉత్పత్తి
1	200	132
2	200	131
3	200	173
4	500	315
5	500	299
6	500	297
7	500	495
సోలార్	10	04
ఫ్లోటింగ్ సోలార్	100	49
తెలంగాణ యూనిట్–1	800	758
తెలంగాణ యూనిట్–2	800	762

జ్యోతినగర్(రామగుండం): రామగుండంలోని ఎన్టీపీసీ 2,600 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టు నిర్దేశిత వార్షిక లక్ష్యాన్ని చేరుకుంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 16,598.7 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించగా ఐదు రోజుల ముందే 16,645 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి లక్ష్యం ఛేదించింది. 72.88 ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్(పీఎల్ఎఫ్)తో లక్ష్యాన్ని చేరుకోవడం విశేషం. బొగ్గు ఆధారిత ఎన్టీపీసీ విద్యుత్ థర్మల్ ప్లాంట్లలో రామగుండం ఎన్టీపీసీ సరికొత్త రికార్డు సృష్టించింది. ఆర్థిక సంవత్సరంలో యూనిట్ల వార్షిక మరమ్మతులు కూడా షెడ్యూల్ ప్రకారం పూర్తయ్యాయి. పవర్ డిమాండ్ తగ్గిపోయినా నిర్దేశిత లక్ష్యం చేరుకోవడం విశేషం.

భగవంతుడు సర్వాంతర్యామి

- శ్రీత్రిదండి చినజీయర్‌స్వామి



జ్యోతినగర్(రామగుండం): భగవంతుడు సర్వాంతర్యామి అని శ్రీత్రిదండి చినజీయర్‌స్వామి అన్నారు. ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్ అన్నపూర్ణకాలనీలోని శ్రీ రామచంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో స్వామీజీ పాల్గొనానరు. ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలని, అవి మనిషిలో మంచి పరివర్తన తెచ్చే నిలయాలు కావాలని సూచించారు. కాగా, మూడురోజులుగా సాగుతున్న ప్రత్యేక పూజల్లో భాగంగా బుధవారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చెప్యాల రామారావు, కేశవరావు, సతీశ్‌రావు, మాధవరావు, శరత్‌రావు, సత్యనారాయణరావు, శ్రీపతిరావు, రావికంటి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వేసవి శిబిరాలు



అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: పాఠశాలలకు వేసవి సెలవులు రావడంతో మూడు నుంచి ఐదో తరగతి వరకు చదివే విద్యార్థులకు లర్నింగ్ గ్యాప్ రాకుండా వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీతో కలిసి సమ్మర్‌లో విద్యార్థులకు బోధించేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చిన యువతను కలెక్టర్ అభినందించారు. భారత్‌దేక్ష టీం ద్వారా ప్రత్యేకంగా నిర్వహించే సమ్మర్ క్యాంపుల్లో వలంటీర్లు చిన్నారులకు ఆసక్తి కలిగించేలా సూచనలివ్వాలన్నారు. ఉల్లాసంగా, ఉత్సాహంగా వేసవి శిబిరాల్లో భవిష్యత్ తరాలకు అవసరమయ్యేలా జ్ఞానాన్ని అందించాలని అన్నారు. మేధస్సును పెంచే ఆటలపై అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాల అకడమిక్ అధికారి పీఎం షేక్, భారత్‌దేఖో టీం సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరువు పోతుందని యువకుడి ఆత్మహత్య



రాజశేఖర్‌రెడ్డి(ఫైల్)

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ తీగల వంతెన వద్ద సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మల్లాపూర్‌కు చెందిన దూది రాజశేఖర్‌రెడ్డి (28) బుధవారం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తన ఆత్మహత్యకు ఓ యువతి కారణమంటూ సూసైడ్ నోట్ రాశాడు. ఆరేళ్లుగా కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో పనిచేస్తున్న రాజశేఖర్‌రెడ్డికి ఇటీవల పెళ్లి సంబంధం చూశామని తండ్రి దూది రఘుపతిరెడ్డి తెలిపారు. అయితే అదే హోటల్‌లో పనిచేస్తున్న ఓ యువతి బ్లాక్ మెయిల్ చేస్తూ తన కుమారుడిని పెళ్లి చేసుకోకుండా అడ్డుకునే ప్రయత్నం చేసిందన్నారు. ఈ నెల 23న నలుగురు వ్యక్తులతో కలిసి మల్లాపూర్ గ్రామానికి వచ్చి పరువు తీసిందని ఆరోపించారు. మళ్లీ గ్రామానికి వస్తానని బెదిరించడంతో పరువు పోతుందనే భయంతో కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పురుగుల మందు తాగిన ప్రభుత్వ ఉద్యోగి



మణికుమార్ వద్ద కానిస్టేబుల్ జుబేర్

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని గొల్లపల్లి రోడ్‌లో ఓ ప్రభుత్వ ఉద్యోగి పురుగుల మందుతాగాడు. ఆ వెంటనే 100కు డయల్ చేశాడు. స్పందించిన బ్లూకోల్ట్స్ సిబ్బంది అతడిని సకాలంలో ఆసుపత్రిలో చేరించారు. మూలుగు జిల్లా వాజేడు తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మణికుమార్ భార్య జగిత్యాలలోని ఓ ప్రభుత్వ శాఖలో పనిచేస్తోంది. ఇటీవల ఇద్దరి మధ్య తరుచూ గొడవలు కావడంతో మణికుమార్ జగిత్యాలకు వచ్చాడు. బుధవారం సాయంత్రం ఇద్దరి మధ్య గొడవ జరగడంతో మనస్తాపానికి గురై గొల్లపల్లి రోడ్‌లోని తిమ్మాపూర్ చౌరస్తా వద్ద పురుగుల మందుతాగాడు. వెంటనే 100కు డయల్ చేయడంతో వారు బ్లూకోల్ట్స్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. దీంతో కానిస్టేబుల్ జుబేర్ సత్వరమే స్పందించి సంఘటన స్థలానికి చేరుకుని మణికుమార్‌ను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. సత్వరమే స్పందించిన జుబేర్‌ను స్థానికులు అభినందించారు.

జీజీహెచ్‌లో మెరుగవుతున్న వైద్య సేవలు



కల్యాణికి జాగ్రత్తలు చెబుతున్న ఆర్ఎంవో అరుణ



వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలుపుతున్న శిరీష

- శస్త్రచికిత్సలపై పెరిగిన ప్రత్యేక శ్రద్ధ
- సంతోషం వ్యక్తం చేస్తున్న పేషెంట్లు

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో వైద్య సేవలు మెరుగవుతన్నాయి. తరచూ పేషెంట్లను ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేస్తారనే అపవాదు ఎదుర్కొంటున్న వైద్యులు.. తాజాగా మహిళా ఇన్‌పేషెంట్లకు శస్త్రచికిత్సలు చేసిన తీరుపై ప్రశంసలు పొందుతున్నారు. శస్త్రచికిత్స చేయించుకున్న కల్యాణి, శిరీష మాట్లాడుతూ, వైద్యులు, వైద్య సిబ్బందిలో మార్పు వచ్చిందని, వారి కృషితోనే తమకు ఆపరేషన్లు విజయవంతమయ్యాయని సంతోషం వ్యక్తం చేశారు.

బాధ నుంచి విముక్తి

నేను మెప్మాలో ఆర్పీగా పనిచేస్తున్న. నాలుగేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్న. పెద్దపల్లి ప్రభుత్వ చూపించుకుంటే కరీంనగర్ లేదా గోదావరిఖనికి రెఫర్ చేస్తమన్నరు. డిసెంబర్‌లో గోదావరిఖని జీజీహెచ్‌లో చూపించుకున్న. బీపీ, షుగర్ ఎక్కువ ఉండడంతో డాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపించిండ్రు. నాలుగు నెలలపాటు మందులు ఇచ్చిండ్రు. ఈనెల 19న గర్భసంచి ఆపరేషన్ చేసి బాధ నుంచి నాకు విముక్తి కల్పించిండ్రు. ఆపరేషన్ సక్సెస్ కావడంతో డిచార్జి చేస్తున్నరు. ఇక్కడ ఆపరేషన్ చేయకపోతే ప్రైవేట్ ఆస్పత్రిలో వేలాది రూపాయాలు వెచ్చించాల్సి వచ్చేది. జీజీహెచ్‌లో మంచి ట్రీట్మెంట్ ఇస్తున్నరు.

– ఎం.కల్యాణి, బొంపల్లి, పెద్దపల్లి

13ఏళ్ల తర్వాత కాన్పు

13 ఏళ్లకింద నాకు మ్యారేజ్ అయ్యింది. పిల్లలు పుట్టలేదు. హైదరాబాద్‌లోనే రూ.4లక్షలు ఖర్చుచేసి ప్రైవేట్‌లో ఐవీఎఫ్ ట్రీట్మెంట్ తీసుకున్న. తర్వాత గర్భం వచ్చింది. గోదావరిఖని జీజీహెచ్‌లో మంచి ట్రీట్మెంట్ ఇస్తున్నరని తెలిసి 20 రోజుల క్రితం అడ్మిట్ అయిన. ఆపరేషన్‌తో డెలివరీ చేసిండ్రు. బాబు పుట్టిండు. మాటల్లో చెప్పలేని ఆనందంగా ఉంది. ఆలస్యంగా గర్భం దాల్చిన నాకు చాలా కాంప్లికేషన్స్ ఉన్నయ్. అయినా మంచి ట్రీట్మెంట్ ఇచ్చిండ్రు.

– పటోళ్ల శిరీష, ఎన్టీపీసీ నర్రశాలపల్లి

పచ్చని సంసారంలో మద్యం చిచ్చు

- తాగిన మైకంలో భార్యపై రాడ్‌తో దాడి
- అక్కడికక్కడే చనిపోయిన భార్య
- అనాథగా మారిన ఒక్కగానొక్క కూతురు



రజిత మృతదేహం పక్కన రోదిస్తున్న బంధువు

వెల్గటూర్ : మద్యం మత్తు ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. ఓ వ్యక్తి కట్టుకున్న భార్యను రాడ్‌తో కొట్టి చంపిన సంఘటన ఎండపల్లి మండలం మారేడుపల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మారేడుపల్లికి చెందిన వ్యాళ్ల పున్నంరెడ్డికి ధర్మారం మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన రజితతో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కూతురు అక్షిత రెడ్డి(11) జన్మించింది. కొద్దిరోజులుగా పున్నంరెడ్డి మద్యానికి బానిసయ్యాడు. అప్పటినుంచి భార్యాభర్తల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. మంగళవారం అతిగా మద్యం సేవించిన పున్నంరెడ్డి అర్ధరాత్రి సమయంలో భార్య రజితతో గొడవ పడ్డాడు. మాటామాటా పెరగడంతో రజిత(38)ను ఇనుపరాడ్‌తో బలంగా కొట్టడంతో తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. రజిత మృతదేహాన్ని చూసి బంధువులు గుండెలవిసేలా రోదించారు. రజితకు కూతురు అక్షిత రెడ్డి తలకొరివి పెట్టింది. రజిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. తల్లి రజిత కాటికి.. తండ్రి జైలుకు వెళ్లడంతో వారి కూతురు అనాథగా మారింది.

జల్సాలకు అడ్డుపడుతోందనే భార్య హత్య

- కేసులో భర్త అరెస్టు : ఏసీపీ గజ్జి కృష్ణ



మాట్లాడుతున్న ఏసీపీ కృష్ణ

పెద్దపల్లిరూరల్: మద్యానికి బానిస అయిన భర్త.. జల్సాలకు అడ్డుపడుతూ నిత్యం గొడవకు దిగుతోందని భావించి కట్టుకున్న భార్య వ్యాళ్ల రజితను భర్త వ్యాళ్ల పున్నంరెడ్డి కడతేర్చాడని పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ తెలిపారు. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం మారెడుపల్లిలో జరిగిన సంఘటన వివరాలను బుధవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అయోధ్య రామమందిర దర్శనానికి వెళ్లొచ్చి మద్యం తాగడం మానేసిన పున్నంరెడ్డి.. మంగళవారం మళ్లీ మద్యం తాగడాన్ని భార్య రజిత ప్రశ్నించింది. మద్యం తాగినప్పుడల్లా భార్యతో గొడవ పడాల్సి వస్తోందని, జల్సాలకు ఆమె అడ్డుగా ఉందని భావించిన పున్నంరెడ్డి.. ఇనుప చైన్‌పానతో రజితతలపై బలంగా కొట్టాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. తల్లి వజ్రవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పున్నంరెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో సీఐ కృష్ణ, బసంత్‌నగర్ ఎస్సై స్వామి పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని కార్మికుడి మృతి

పెద్దపల్లిరూరల్: అందుగులపల్లి వద్ద బుధవారం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన పుట్ట మల్లయ్య(58) అనే కార్మికుడు మరణించాడు. బసంత్‌నగర్ సిమెంట్ కర్మాగారంలో పనిచేసే పుట్ట మల్లయ్య.. తన ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వేగంగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. వెంటనే స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మల్లయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మరణించాడు. ఈ ప్రమాదంపై విచారణ జరుపుతున్నామని బసంత్‌నగర్ ఎస్సై స్వామి తెలిపారు.

అదనపు కోసం వేధిస్తున్న ముగ్గురిపై కేసు

కథలాపూర్: మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్ గ్రామానికి చెందిన బంటు నారాయణతోపాటు మాణిక్యం, భారతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్ కుమార్ బుధవారం తెలి పారు. మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన బంటు లావణ్యను అదనపు కట్నం తీసుకురావాలని ఆమె భర్త నారాయణతోపాటు బావ, ఆడబిడ్డ వేధింపులకు గురిచేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

జమ్మికుంటలో..

జమ్మికుంట: అదనపు కట్నం తీసుకురావాలని వేధింపులకు పాల్పడుతున్న వారిపై కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరగంటి రవి తెలిపారు. పట్టణానికి చెందిన జ్యోతిని బీమదేవరపల్లి మండలం మాణిక్యపూర్ గ్రామానికి చెందిన ఒల్లాల తిరుపతితో ఐదేళ్ల క్రితం పెళ్లి చేశారు. వీరికి ఒకపాప, పెళ్లిలో రూ.మూడులక్షల కట్నం, మూడు తులాల బంగారం, ఇతర లాంచనాలు అందజేశారు. నెలరోజులుగా మద్యం సేవించి, అదనపు కట్నం తీసుకురావాలని భర్త మహేందర్, మామ తిరుపతి వేధిస్తున్నారని, బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఆరుగురికి జైలు

కరీంనగర్‌క్రైం: డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఆరుగురికి కరీంనగర్ మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరీముల్లాఖాన్ తెలిపారు. పట్టణంలో మద్యం తాగి, వాహనాలు నడుపుతూ 18 మంది పట్టుబడ్డారని అన్నారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపరచగా ఆరుగురికి జైలుశిక్ష, మిగతా వారికి జరిమానా వేశారని పేర్కొన్నారు.



'హలో.. మైనేమీజ్ మార్క్'

'హలో మై నేమ్ ఈజ్ మార్క్.. ఐయామ్ ఫ్రమ్ జర్మనీ.. ఐయామ్ టూరిస్ట్ నేచర్ లవర్' అని పోలీసులతో మాట్లాడుతుంటే కాసేపు సరదాగా అనిపించింది. అందుకే ఆ జర్మనీ దేశస్తుడితో పోలీసులూ కాసేపు ముచ్చట్లు పెట్టారు. పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్ ఎస్సై–2 శివానీరెడ్డి బుధవారం బసంత్‌నగర్ టోల్‌గేట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఇదే సమయంలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేస్తున్నారు. ఈసందర్భంగా చార్జింగ్ బైక్‌పై దేశాలన్నీ తిరుగుతూ వస్తున్న జర్మనీ దేశస్తుడు హెల్మెట్ తొలగించడంతో విదేశీయుడని పోలీసులు గుర్తించారు. ఆయనతో కాసేపు సరదాగా మాట్లాడారు. తాను ఆన్‌లైన్‌లో ఓ జాబ్ చేస్తుంటానని, భారత్‌లో చూడదగ్గ ప్రదేశాల్లో పర్యటిస్తూ మహారాష్ట్రలోని చంద్రపూర్ వెళ్తున్నానని తెలిపారు. అక్కడి నుంచి నేపాల్, స్విట్జర్లాండ్ వెళ్లి మరికొన్ని దేశాలు చుట్టిరావాల్సి ఉందని వివరించారు. బైక్‌పైనే ఈ ప్రయాణం అని చెప్పుకొచ్చారు జర్మనీదేశస్తుడు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి